అంతర్వాహిని

'హితశ్రీ'

* గత సంచిక తరవాయి *

4

వాకిట్లో జట్కాబండి ఆగిన చప్పుడు విని గోపీ పరుగెత్తుకొచ్చి గేటుతలుపు తీసి సంతోషంగా కేక పెట్టాడు.

"అన్నయ్యొచ్చాడమ్మా."

విశ్వం చిరునవ్వుతో వాడివైపు చూసి "ఏరా గోపీ, కులాసాగా ఉన్నావా?" అన్నాడు.

గోపీ తల ఆడించాడు. వరండాలోకి విశ్వం వచ్చేసరికి వరసగా అందరూ ఇంట్లోంచి బయటికొస్తున్నారు.

"ఏరా విశ్వం, పరీక్షలన్నీ బాగా రాశావా?" అన్నారు రంగనాథంగారు.

"ఆ: సెకండ్ క్లాస్ తప్పక వస్తుంది."

"అదేమిటిరా, అలా సగమైపోయావు? పాడు పరీక్షలు." అంది విశ్వం తల్లి.

"ఇంక పరీక్షల గొడవ లేదుగా." అంది పద్మ.

"ఓహో పద్మావతమ్మగారా? నీతో పోటీకైనా హిందీ పరీక్షలకి కూచోకుండా ఉంటానా?"

"హిందీ పరీక్షలకే లేకపోతే డ్రాయింగ్ పరీక్షలకికూడా కూచో, నాదేం పోయింది మధ్య?"

"థాంక్స్. పర్మిషన్ ఇచ్చావుగద."

చిరునవ్వుతో లోపలికొచ్చాడు విశ్వం. హాల్లో శ్రీనివాసరావు రేడియో వింటూ కూర్చున్నాడు.

"ఓ. డాక్టరుగారా! నమస్తే."

"కూర్చోవోయ్ విశ్వం." వాల్యూం తగ్గిస్తూ అన్నాడు శ్రీనివాసరావు.

మా ఇంట్లో మాకు నువ్వు మర్యాద చెయ్యక్కర్లేదులే."

"ఎవరిల్లయితే ఏం, బంధువు బంధువే."

"డాక్టర్ గారికి మందులసంగతికంటే మర్యాదల సంగతే బాగా తెలుసల్లే ఉంది."

"మన తెలుగుదేశంలో కొత్తగా పెళ్ళయిన వాడికి ముందు ముఖ్యంగా తెలిసేది అదేగ!"

ఇద్దరూ నవ్వారు.

"పండక్కి రావటానికి వీలుండదేమో నని రాశావుటగా. ఎలా వీలయింది?"

"పండక్కి రాకపోతే చాలా నష్టపడాలి సాస్త్రం దని చుట్టపక్కాలు సలహా ఇచ్చార్లే—అందువల్ల వీలయింది." అన్నాడు శ్రీనివాసరావు ఓరగా పద్మ వైపుచూసి. పద్మ ఇదేమీ వినవట్టు దొంగ వేషంవేసి లోపలికి జారుకుంది.

"ఏమిటె గిరాకీ?" అన్నాడు విశ్వం నవ్వుతూ.

"గ్లాస్గోపంచెలూ మొదలైనవి పండగ తప్పించి మరీ వొచ్చావు. ఏమిటో కారణం?"

విశ్వం జరిగిన సంగతి చెప్పాడు. ఇంతలోకే గోపీ వొచ్చి "అన్నయ్యా, స్నానంచేసి వొస్తే అమ్మ కాఫీ ఇస్తుందట." అన్నాడు. "రేడియో వింటున్నట్టున్నావు. నిన్ను ఇబ్బంది పెట్టనులే. కాసేపాగి పునర్దర్శనం చేసుకుంటాను." అని విశ్వం లేచినుంచున్నాడు. "నేనూ అలా కాసేపు బయటికి వెళ్లొస్తాలే. మధ్యాహ్నం తీరిగ్గా ఒకళ్లనొకళ్లం విసిగించుకోవచ్చు" అని శ్రీనివాసరావు బయటికి నడిచాడు.

విశ్వం స్నానంచేసి, కాఫీ తాగి పేపర్ ముందేసుకుని వార్తల శీర్షికలు చూస్తున్నాడు. గోపీ అతనికి దగ్గర్లోనే చాప వేసుకు కూర్చుని లెక్కలు చేసుకుంటున్నాడు.

"గోపీ, బావేరీ?"

పద్మ కంఠం విని విశ్వం తలెత్తాడు.

"బజారుకి వెళ్ళాడు" చెప్పాడు గోపీ.

"ఎందుకూ?"

"ఏమో?"

"ఏమో" ఏమిట్రా? ఏమైనా కావాలేమో, 'నేను తెచ్చిపెడతానులే బావా' అనకూడదూ? థర్డ్ ఫారం చదువుతున్నావు గాని......"

"అయితే బావ అంత చదువుకున్నాడు కదా, అడక్కుండా తనే చెప్పకూడదా ఏమిటక్కయ్యా?"

గోపీ ఎదురు ప్రశ్నకి విశ్వానికి నవ్వొచ్చింది.

"డాక్టర్ గారికి కోపం వొచ్చింది" అన్నాడతను.

"కోపమా!" అంది పద్మ తెల్లబోయి.

"అవును అంటే ఆగ్రహం."

"ఎందుకూ?" కొంచెం బెదురుగా అంది.

"కాఫీ ఇవ్వలేదని."

"ఎందుకివ్వలేదు. నేనేగా ఇచ్చిన దాన్ని."

"అయితే ఏమీ తోచక ఇంకోసారి కాఫీ తాగి రావటానికి బజారుకి వెళ్లి ఉంటాడు."

పద్మ గ్రహించింది.

"వేళాకోళమేనా. నిజమేమోనని హడలిపోయాను."

"ఎందుకంత భయం?"

"భయం దేనికీ?"

"మరి హడలిపోయానన్నావేం?"

"మాటవరసకి అన్నాను."

"దాస్తావేం? పద్మా, నిజం చెప్పాలంటే ఈ ఆడవాళ్లకి బుద్ధిలేదు. మొదట మొదట నేర్పుతారు. తరవాత ఏకుమేకై ఊరుకుంటుంది. ప్రతి చిన్నదానికీ భర్తగారికి కోపం వస్తుందేమోనని బెంగపడిపోతారు. చివరికి అదే ఖాయమైపోతుంది. ముందు జాగ్రత్తకి చెబుతున్నాను. పూర్వపురోజులు పోయాయి. ఈ రోజుల్లో కావాలిసింది అన్ని రంగాల్లో అందరికి సమాన హక్కులు. సమతారాజ్యస్థాపన జరగాలంటే ఎవరి హక్కులు వాళ్లు తెలుసుకుని అవి సిద్ధించేవరకూ విశ్రమించకూడదు. ఈ చివరిమాటలు నావి కావులే. ఇదిగో, ఈ మూల మహిళా మహోదయసంఘ వార్షిక సభలో ప్రసంగవిశేషాలు చూడు."

గంభీరంగా ప్రారంభించి వ్యంగ్యోక్తితో ముగించిన విశ్వంవైపు బిత్తరపోయి చూసింది పద్మ.

"ఏమిటన్నయ్యా నీ గొడవ, భలేవాడివిలే" అనేసి ఆమె మేడ మీదికి వెళ్ళిపోయింది.

గోపీ ఈ గొడవ పట్టించుకున్నట్టులేదు. వాడు పెదవులు బిగించి కలం గడ్డం కింద పెట్టుకుని దీర్ఘాలోచనా తత్పరుడై ఉన్నాడు. ఆ భంగిమ చూసి విశ్వం అడిగాడు.

"ఏమిట్రా గోపీ ఆ ఆలోచన?"

గోపీ ఆ ప్రశ్నకి ఆలోచన నించి తేరుకుని విశ్వం వైపు చూసి అన్నాడు.

"x విలువ తప్పిందన్నయ్యా."

"ఏదీ ఇలా తే."

గోపీ దగ్గిరికొచ్చి లెక్క చేసిన పుస్తకం విశ్వానికిచ్చాడు.

"గోటితో పోయేదానికి గొడ్డలి దేనికిరా? ఈ లెక్క x పద్ధతిలో చెయ్యక్కర్లేదు. కొన్న ఖరీదు 100 అనుకో చిటికెలమీద వచ్చేస్తుంది ఆన్సర్."

గోపీ అనుమానంగా విశ్వంవైపు చూశాడు.

"మా మేష్టరుగారు x పద్ధతిలో చెయ్యమని చెప్పారే!"

"ఆయనెవరోగాని ముక్కు చూపించమంటే తలవెనకనించి చెయ్యి పోనిచ్చి చూపించేట్టున్నాడే."

గోపీకి కొంచెం నవ్వొచ్చింది.

"రంగారావు మాష్టరుగారన్నయ్యా"

"ఏ రంగారావు?"

"నీ స్నేహితుడేటగా."

విశ్వం కొంచెం ముఖం చిట్లించి "ఓహో, వాడా!" అన్నాడు.

"రంగారావు మాష్టరుగారు నిన్ను చాలాసార్లు అడిగారు."

"నా క్లాసుమేటేలే."

"ఆయనకి లెక్కలు బాగా వొచ్చు. బలేబాగా చెప్తారుకూడా."

"సరేలే. నేను చెప్పినట్లు ఈ లెక్క చెయ్యి." అయిష్టంగా పుస్తకంవైపు చూశాడు గోపీ.

"ఏమిట్రా నీ సందేహం? నేను మీ మాష్టరుకంటే అయిదు క్లాసులు ఎక్కువ చదివాను, తెలుసా?" అన్నాడు విశ్వం.

గోపీకి ఆశ్చర్యం వేసింది. అన్నయ్య అబద్ధం చెబుతున్నాడని అతననుకోలేదుగాని ఆ విషయం అతనికి నమ్మ తగిందిగా కనిపించలేదు. ఆ పసి మనసుకి చదువుల్లో తేడాలు తెలియవు. మాస్టరుగారు సునాయాసంగా బోర్డుమీద లెక్కలు చేసేస్తుంటే అదో విధమైన అభిమాన పూర్వకమైన గొప్ప అభిప్రాయం ఆయనమీద గోపీకి ఏర్పడ్డది.

తను చెప్పిన పద్ధతిలో లెక్క ఎలా చేయాలో వివరించి ఆ ప్రకారం చేసి మాస్టరుగారికి చూపించమని చెప్పి మేడమీదికి వెళ్లాడు విశ్వం.

వాకిలి తెరకి కాబోలు తెల్లటిగుడ్డమీద రంగు దారాల్తో కుడుతూ పందిరిమంచంమీద కూర్చుంది పద్మ.

"ఏమిటి పద్మా ఆ డిజైను?"

"పద్మ వెనక్కి తిరిగిచూసి, రేఖాచిత్రాన్ని చూపిస్తూ "మామిడిచెట్టుమీద కోయిల" అంది. ఆ బొమ్మ తీక్ష్ణంగా చూసి అన్నాడు విశ్వం.

"వేపచెట్టుమీది కాకికదూ?"

"కాదు. సరిగా చూడు" అంది పద్మ అమాయకంగా.

"మరి ఆ మాటలు కింద రాయలేదేం?"

"ఎందుకూ?"

"లేకపోతే ఎలా తెలుస్తుందీ?"

విశ్వం కళ్ళలోకి చూసింది పద్మ. అతను నవ్వాపుకుంటున్నాడు. అప్పటికి తెలిసిందామెకి అతని మాటల్లోని వ్యంగ్యం.

"పోదూ గొడవ" అంది విసుగ్గా.

"ఎవరిదీ మహత్తర శిల్పం?"

"నేనే వేశాలే."

"నువ్వా?"

అటువంటి పొరపాటు పని పద్మ ఎప్పుడూ చెయ్యదని అతనికి బాగా నమ్మకం ఉంది. డిజైన్లకి కార్బన్ కాపీలు తియ్యటానికి పైమెట్టు ఆమె ఊహకి అతీతం. ఆలోచించగా విశ్వానికి అకస్మాత్తుగా తట్టింది.

"ఓ, డాక్టరుగారి చిత్రకళానైపుణ్యం కాబోలు. అవునా?"

"కాదులే" అంది పద్మ.

"నాకు తెలుసులే."

"తెలిస్తేసరే. పన్ను పనిచేసుకోనీ."

దృఢపడిపోయింది అతని అనుమానం. చూస్తూ చూస్తూ పద్మ శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరు కానివ్వటం అతని కిష్టంలేదు.

"ఘట్టుక్లాసయిన బొమ్మ నేను వేసిపెడతాలే. పాపం డాక్టరుగార్ని ఎందుకు అవస్థ పెట్టావు?" అని పద్మ సమాధానంకోసం కూడా ఎదురు చూడకుండా ఆమె చేతిలో ఫ్రేంలాక్కుని, గుడ్డ సరిచేసి తనకి చిరపరిచితమైన రేఖాచిత్రం 'మామిడిచెట్టుమీద కోయిల' త్వరత్వరగా గీశేశాడు.

"ఎలా ఉంది?"

"ఎన్నిసార్లు వేసినా అదేగా?"

తెల్లబోయాడు విశ్వం. "ఐతేమాత్రం?" అన్నాడు.

"సరేలే, ఇలా ఇవ్వు" అంది పద్మ.

"సరైన రంగుదారాలతో కుడితే ఫస్టుగా ఉంటుంది. డాక్టర్ హడిలిపోవాలిసిందే" అని వెనక్కి తిరిగి వెళ్ళబోతూ గదిలోని నిలువుటద్దంలో చూసుకుని అదిరిపడి పద్మవైపుతిరిగి "ఇదేమిటి పద్మోయ్, ఈ పందొమ్మిదో శతాబ్దపు అలంకారం?" అన్నాడు. అదేమిటోనని పద్మ వెనక్కి చూసింది. నిలువుటద్దం చూపించాడు విశ్వం. అది పూర్వం గోడకి జేరగిలవేసి ఉండేది. ఇప్పుడు గోడనించి ముందుకు వంగి ఉండటంచూసి విశ్వం ఆశ్చర్యపోయాడు. వెంటనే దాన్ని మళ్లీ వెనకటి స్థితిలో ఉంచటానికి ప్రయత్నించసాగాడు.

"హెయిర్‌కటింగ్ సెలూన్‌లోలాగా గోడకి జేరవెయ్యటమేమిటి? అలా ముందుకి ఉంటేనే బాగుంటుంది." అంది పద్మ విసుగ్గా.

అద్దం అలా వొదిలేసి ఆశ్చర్యంగా విశ్వం పద్మ ముఖంలోకి చూశాడు.

"హెయిర్‌కటింగ్ సెలూనా? అక్కడ ఎలా ఉంటుందో నీకేం తెలుసు?"

పద్మ మాట్లాడలేదు. వెంటనే విశ్వానికి అర్థమైంది. ఇది డాక్టర్ గారి అభిరుచి కాబోలు. అభిప్రాయాలు ఆడవాళ్లు ఎంత త్వరలో మార్చుకుంటారు.

మరేమీ మాట్లాడకుండా విశ్వం మేడదిగి హాల్లోకి వచ్చాడు. గోపీ అక్కడ లేడు. పుస్తకాలు మాత్రం చాపమీద నే ఉన్నాయి. లెక్క ఎలా చేశాడో చూడాలని పుస్తకం తెరిచాడు విశ్వం. అతని ఆశ్చర్యానికి మేర లేదు. ఆ లెక్క x పద్ధతిలోనే మళ్లీ చెయ్యబడి ఉంది. తను చేసి చూపించిన నమూనా కోసం పుస్తకంలో వెతికాడు విశ్వం. అదెక్కడా కనిపించలేదు. విశ్వం కిటికీలోంచి బయటికి చూశాడు. ఓ మూల ఓ కాగితం ఉండ కనిపించింది. అది చూడగానే విశ్వానికి నవ్వొచ్చింది. "ఓరి వెధవా!" అనుకున్నాడు. ఈ విషయం పద్మకికూడా చెప్పి ఆమెని పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వించాలనుకున్నాడు. సరాసరి మేడమీదికి వెళ్లాడు.

పద్మ అల్లికపని చేస్తూనే ఉంది. విశ్వం తొంగి చూశాడు. అది తను వేసి ఇచ్చిన బొమ్మ కాదు. పద్మ అంతకిపూర్వం కుట్టటానికి ప్రారంభించిన చిత్రం. విశ్వం బుర్ర గోక్కున్నాడు. ఏం మనుషులు వీళ్లందరూ? విచక్షణాజ్ఞానం ఉపయోగించరేం? యుక్తమేమిటో తెలుసుకోవటం కూడా ఇష్టం ఉన్నట్టు లేదు. మాటిమాటికి ఆశ్చర్యపోవటం తనవంతవుతోంది. ఇంతకీ మనుషుల భావాలు చిత్రమైనవి.

విశ్వం పద్మతో మాట్లాడకుండానే వెనక్కి తిరిగి మేడదిగి మళ్లీ హాల్లోకి వచ్చేశాడు. అక్కడ రంగనాథంగారు కూర్చుని వున్నారు. విశ్వాన్ని చూడగానే ఆయన అన్నాడు.

"ఒరే విశ్వం, బావ రేపు వెడతానంటున్నాడు. సాయంత్రం బజారుకివెళ్లి ఖరీదైన మంచి సూటింగ్ క్లాత్ సెలెక్ట్ చేసి తీసుకువస్తావా? అతనికి మరీ మొహమాటం. షాపుకి వెళ్లి నచ్చింది చూడమంటే ఒప్పుకోడు. నువ్వే వెళ్ళి ఆ పనేదో చూడు కాస్త."

"అలాగే నాన్నా." అన్నాడు విశ్వం.

5

"కాలం సాగిపోతోంది. పనులు జరిగిపోతున్నాయి. గుమాస్తాలు రాస్తున్నారు. రైతులు పొలం దున్నుతున్నారు. పంట పండిస్తున్నారు. శ్రామికులు శ్రమించి స్వేదజలం వర్షిస్తున్నారు. పెద్ద ఉద్యోగులు హుంకరిస్తున్నారు. ఫ్యాక్టరీల గొట్టాలు పొగ విడుస్తున్నాయి. మంత్రులు తిరుగుతున్నారు. నాయకులు అరుస్తున్నారు. విద్యార్థులు పుస్తకాలు తిరగేస్తున్నారు. పండిన ధాన్యం ఎక్కడో ఉడుకుతూనే ఉంది. ఇలా పనులు జరిగిపోతూనే ఉన్నాయి. కాలం గడుస్తూనే ఉంటుంది. కాలగమనం చూడగలిగినవాళ్లు చూస్తూనే ఉంటున్నారు. లేనివాళ్ళు నిర్లక్ష్యంగా కళ్ళు మూసుకుంటూనే ఉన్నారు. ప్రపంచంలో పుట్టి పెరిగిన ప్రతివాడూ ఏదో పనిచేస్తూనే ఉన్నాడు.

నహి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్
కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః

అన్నాడు గీతాకారుడు.

కాని ప్రతిపనీ మనిషి అభ్యున్నతికే జరగటం లేదు. మనిషి ఇంకా గొప్పగా బతకటానికి ఉపకరించే పనుల్ని కాలం దొంగిలిస్తోంది. వాటికి బదులు మనిషిని కిందికి లాగే పనుల్ని కాలం ఇప్పుడు మనకిస్తోంది.

కాలం వెనక్కి తిరగదు. చేసిన పనుల్ని చెరపలేము. క్షణక్షణమూ జీవితం ఖర్చయిపోతోంది. తక్షణము జరగాలిసిన పని ఏమంటే, మానవజీవిత ప్రమాణాన్ని అన్నిరంగాలలో కొన్ని మెట్లు పైకిలాగే ప్రయత్నం. నేడు ప్రపంచం మొత్తంమీద జరగాలిసిన పని ఇది ఒక్కటే. ఇది ఎలా సాధ్యపడుతుందో చూద్దాం..."

మైదానంలో ఒక సాంఘిక సేవాపరుడు ఉపన్యసిస్తున్నాడు. ఉపన్యాసాన్ని మొదటినుంచీ శ్రద్ధగా వింటున్నాడు విశ్వం. అప్రయత్నంగా అతనిలోని చిలిపితనం తలెత్తింది. ఉపన్యాసకుడు ఉపన్యాసాన్ని వెంటనే కొనసాగించకుండా కొంతసేపు ఆగి నాలుగుదిక్కులా చూస్తున్నాడు.

"కాలం సాగిపోతోంది" అన్నాడు విశ్వం గట్టిగా విద్యార్థిదశలోని కోణంగితనంతో.

"ఇప్పుడు కాలాన్ని గురించి మాట్లాడిన దెవరో నాకు చూడాలని వుంది" అన్నాడు ఉపన్యాసకుడు.

విశ్వం ధైర్యంగా లేచి నిలబడ్డాడు. అలా అన్నందుకు అతను కొంచెం విచారించక పోలేదు. కాని ఒక పని చేసిన తరవాత దానిఫలితం అనుభవించడానికి అతను వెనుదీయడు.

"దయచేసి మీరు ఒకసారిలా వస్తారా? మీతో రెండు విషయాలు మాట్లాడాలి."

విశ్వం అతనికి దగ్గరగా వెళ్ళాడు.

"మీ పేరు?"

"విశ్వేశ్వరరావు."

"కాలం సాగిపోతోంది అనే విషయం ఇంతకి ముందు మీకెప్పుడైనా స్ఫురించిందా?"

"స్ఫురించకుండా ఉండటానికి అదేం కొత్త సంగతి కాదు గదండీ?" కొంచెం నవ్వుతూ అన్నాడు విశ్వం.

"అప్పుడు మీ భావాలు ఎలా వుండేవో చెప్పగలరా?"

"నిన్న, ఇవాళ, రేపు—ఇదే కదా కాలం అంటే, అనిపించేది నాకు. ఒక్కొక్కప్పుడు కాలం మీద ఏమైనా కవిత్వం రాద్దామని ఉండేది. కాని సరైన భావాలు రాకపోవటంవల్ల రాయలేదు."

"మీ వయసెంత?"

"ఇరవై రెండు"

"ఈ ఇరవై రెండేళ్ల కాలంలో ఎన్నో పనులు చేసి ఉంటారు మీరు."

"అవును, మరి."

"ఇన్ని సంవత్సరాల్లో మీరు చేసిన అతి ముఖ్యమైన పని ఒకటి చెప్పగలరా?"

విశ్వం ఆలోచించాడు.

"ఏదైనా సరే, మీరు గుండెమీద చెయ్యి వేసుకుని ఫలానా ఘనకార్యం చేశానని చెప్పగల ఒక్క పని, కనీసం ఒక్క మంచి పని చెప్పండిచాలు."

విశ్వం నుదుటిమీద స్వేదబిందువులు చేరాయి. ఒక్క మంచి పని...తను ఒక్క మంచి పని కూడా ఇంతవరకూ చెయ్యలేదా? గొప్ప పనికాక పోవొచ్చు-కాని కనీసం ఒక్క మంచి పని...

విశ్వం తలవంచుకున్నాడు నిరుత్తరంగా.

"పోనీ కనీసం అలాంటి పనిఏదైనా చెయ్యాలనుకున్నారా?"

"ఎందుకనుకోలేదు" అన్నాడు విశ్వం తెప్పరిల్లి

"ఏమిటది?"

విశ్వానికి పచ్చివెలక్కాయ నోట్లోపడ్డట్టయింది. ఎంత ఆలోచించినా ఏమీ తట్టటం లేదు.

"ఒక్క ప్రశ్న అడుగుతాను. తడుముకోకుండా సమాధానం చెబుతారా?"

"అడగండి."

"మీ జీవిత లక్ష్యం ఏమిటి?"

ఏమిటి తన జీవిత లక్ష్యం? శూన్యంగా చూశాడు విశ్వం.

"మీకు ప్రత్యేకించి ఏమీ లక్ష్యం లేదన్న మాట?"

తను పూర్తిగా పరాభవం పొందాడు. కాని పరాభవం కంటె కూడా తన నిష్ప్రయోజకత్వం అతన్ని బాధపెట్టింది. ఇటువంటి ప్రశ్నలే తనలో ఎప్పుడూ ఉదయించలేదు.

ఎంత భావదారిద్ర్యం!

ఉపన్యాసకుడు విశ్వం బుజం తట్టి అన్నాడు. "జరిగిన కాలంలో మీరేమీ చెప్పతగిన పని చేసిఉండక పోవొచ్చు. పరవాలేదు. రాబోయే రోజుల్లో మీరు తోటివాళ్లు నిర్విణ్ణులయ్యే మహాకార్యాలు చెయ్యవచ్చు. కావలసిందల్లా చెయ్యాలనే ఉత్సాహం, కోరిక ఉండటం. జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోవటం. గమ్యం చేరుకోటానికి నిజాయితీతో ప్రయత్నించటం. అంతే."

"కృతజ్ఞుడిని" అన్నాడు విశ్వం.

"మీకేమైనా మాట్లాడాలిసిన విషయాలుంటే తరవాత మిమ్మల్ని కలుసుకుంటాను. ఇదిగో నా అడ్రసు." ఒక చిన్న కార్డు విశ్వానికిచ్చాడు ఉపన్యాసకుడు. విశ్వం అది స్వీకరించి సెలవుతీసుకుని బరువుగా అడుగు వేసుకుంటూ మైదానందాటి బజార్లో ప్రవేశించాడు. ఇప్పుడతని మనసులో విచారం లేదు. తను త్వరలోనే మేల్కొన్నాడు. అసలు తన జీవితం ప్రారంభమయ్యే తరుణంకూడా అదే. తన అస్తిత్వాన్ని తను సార్థకం చేసుకోగలడు.

బజార్లో నడుస్తున్నాడు విశ్వం. బజారంతా అతనికి కొత్తకొత్తగా కనిపించసాగింది ఆరోజున. ప్రతి వ్యక్తి శ్రమపడుతున్నాడు ధనసంపాదనకి. శ్రమకి తగిన ప్రతిఫలం మాత్రం అందరికీ ముట్టదు. చిన్న చిన్న దుకాణదారులు రోజంతా శ్రమపడి వస్తువుల అమ్మకంకోసం నానాబాధలూ పడుతూండటం తను చాలాసార్లు గమనించాడు. శక్తిలేని కొనేవాళ్ళు అతని కళ్ళలో ఎప్పుడూ మెదుల్తూనే ఉంటారు. ఏమిటి దీనికి విరుగుడు? ఆలోచిస్తున్నకొద్దీ అతను నిరుత్సాహ

పడ్డాడు. ప్రభుత్వాల్నే ఊపివేసేసమస్య అది. సామాన్యుడు తనేం చెయ్యగలడు?

"పాలిష్ చెయ్యమంటారా బాబూ బూట్లకి?" అడుగుతున్నాడు కుర్రాడు జాలిగా. తన కవసరం లేదు. కాని వాడికుంది. జాలివేసి, చెయ్యమని రెండణాలిచ్చాడు.

ఇలాగే ప్రతివాళ్ళూ తనని ఏదో అభ్యర్థిస్తే? తను జమీందారు కాడు. దిగకుండానే లోతు తెలిసే విషయం ఇది.

జాలైతే తనకి పుట్టెడు ఉంది. ఆ మాటకొస్తే అందరికీ ఉంటుందేమో. కాని హస్తాలు శూన్యం.

సంజచీకట్లు అలముకుంటున్నాయి. తిరిగి తిరిగి విశ్వం తను ఎరిగిన బట్టల దుకాణంలోకి వెళ్ళాడు.

"ఏం కావాలండీ?"

విశ్వం సమాధానం చెప్పేలోపుగా వెనక నించి బతిమాలుతున్న స్వరం వినిపించి వెనక్కి తిరిగి చూశాడు. మాసిపోయిన గడ్డంతో, చిరిగిపోయిన దుస్తులతో, రేగిపోయిన జుట్టుతో, గుంటలుపడిన కళ్లతో ఒకవ్యక్తి కనిపించాడు, దీనాతిదీనంగా అతను ప్రార్థేయపడుతున్నాడు.

"మూడు రోజుల్నించీ తిండి లేదండి. దయచేసి ఏమైనా ఇప్పించండి."

అతను అనుకున్నట్టున్నా అభిమానం అతని ముఖంలో ప్రస్ఫుటమౌతూనే ఉంది.

విశ్వం అతనివైపు పరకాయించి చూశాడు. ఆ వ్యక్తికి అంగలోప మేమీ లేదు. బీదతనం మాత్రం మూర్తీభవించినట్లు ఉంది. ఎంతమంది లేరు అలాంటి వాళ్లు? ఈ వ్యక్తి ప్రత్యేక మేమిటి? విశ్వానికి జాలికలగ లేదు.

"వెళ్లు" అన్నాడు.

ఆవ్యక్తి వెళ్లలేదు. మరింత ప్రార్థేయపడ సాగాడు. అడుక్కోవటం! పైగా బతిమాలుకోవటం! విశ్వానికి వొళ్లు మండింది.

"మనిషిని మనిషి అడుక్కోవట మేమిటయ్యా? అభిమానం లేదూ? ఏదైనా పని చేసుకోకూడదూ ఇలా ముష్టికోసం తిరక్కపోతే?" కర్కశంగా అన్నాడు విశ్వం.

"పని దొరక లేదండి" హీనస్వరంతో అన్నాడా వ్యక్తి.

"దొరక్కపోతే దొరికేచోటుకి వెళ్ళాలి."

"దయచేసి తమరేదైనా ఇప్పించండి."

తను ఇప్పించాలిట, తనదగ్గిర ఉద్యోగాలు కుప్పపోసి ఉన్నట్టు!

"చాల్లేవెళ్లు" కసురుకున్నాడతను.

దుకాణదారు కూడా వెళ్లగొట్టటానికి సిద్ధమయాడు. ఆ వ్యక్తి నిర్లక్ష్యంగా వాళ్లివైపు చూసి వెళ్ళిపోబోతూ విషాదంగా అన్నాడు.

"మీరు పని చూపించలేరని నాకు తెలుసు. అనుకున్నట్టూ ప్రతిపూటా బతుకు వెతుక్కోక పోతే చావరాదా అని మీ అభిప్రాయం. అదే మంచిది అవును. కాని... కాని ఎటొచ్చీ వాడి ప్రాణం ఎంత చులకన! ఎంత చవక..."

దుకాణంలోని వాళ్లందరూ స్తబ్ధులయారు. ఇతనెవడో మామూలు బిచ్చగాడిలా లేడు. స్వచ్ఛంగా కూడా మాట్లాడుతున్నాడు.

విశ్వం హృదయం ఆర్ద్రమైంది. తను మాటలు జారాడు. విసుక్కున్నాడు. ఏమీ చెయ్యలేకపోతే ఊరుకోవొచ్చు. కాని అతని హృదయం గాయపరిచాడు, కొంపతీసి అతను సూచించినట్టు ఏ అఘాయిత్యమో చెయ్యడుగద! లేనిపోనిది తన మెడకి చుట్టుకుంటుందా పాపం. కాని తనేం సహాయం చెయ్యగలడు. ఒకపూట తిండికి ధర్మం చెయ్యగలడు. తరవాత...

ఆ సమయంలోనే ఒక స్త్రీ దుకాణంలోకి వస్తోంది. ఆ అమ్మాయినికూడా అతను అడుగుతాడని చూశాడు విశ్వం. కాని తలెత్తకూడా చూడకుండా ఆ వ్యక్తి వెళ్ళిపోతున్నాడు. ముచ్చెమటలు పోశాయి విశ్వానికి. అతనిశరీరం కంపించింది.

"ఇదిగో. ఏమయ్యోయ్." అని కేక పెట్టాడు. అప్రయత్నంగా అతను వెనుదిరిగి చూశాడు. విశ్వం మళ్లీ పిలిచాడు. అతను తటపటాయిస్తున్నాడు.

ఆ స్త్రీ దుకాణంలోకి వచ్చింది. విశ్వం అది గమనించలేదు. అతని దృష్టిఅంతా ఆవ్యక్తిమీదే ఉంది.

విశ్వం మనసులో ఏదో మెరుపులా మెరిసింది. ఒక్క మంచిపని...

తను ఇంతవరకు చెప్పదగిన మంచిపని ఒక్కటి కూడా చెయ్యలేదు.

ప్రాణం నిలపటం మంచిపనే కదూ!

విశ్వం ఇంకేమీ ఆలోచించలేదు. ఆ వ్యక్తిని మరోసారి పిలిచాడు. అతను ఏమనుకొన్నాడో గాని ముందుకినడిచి విశ్వందగ్గిర నిలబడాడు. విశ్వం ట్రౌజర్ జేబులోంచి వందరూపాయల నోటు తీసి అతని కందిస్తూ అన్నాడు.

"ఇదిగో, తీసుకో, పని చూపించలేను, నిజమే. కాని ఈ వంద రూపాయలతో ఏ కిళ్ళీ దుకాణమో తెరిచి ఏదోవిధంగా పొట్టగడుపుకో వొచ్చేమో. ఏమంటావు?..."

ఆ వ్యక్తి తెల్లబోయాడు. దుకాణంలోని వాళ్ళందరూ ఆశ్చర్యంగా విశ్వంవైపు చూశారు. "వంద రూపాయలే!" అని గుసగుసలు విశ్వానికి వినిపించాయి. ఆ అమ్మాయి విశ్వంవైపు తలెత్తిచూసి, మళ్ళీ ఇంకో సారిచూసి అర్థంకానట్టుగా ముఖంపెట్టింది.

విశ్వం గర్వంగా నుంచున్నాడు. అమరావతి శివలింగంలా తను పెరిగిపోతున్నటనిపించిందతనికి. తన దగ్గిరున్న వాళ్లందరూ మరుగుజ్జుల్లా అవుతున్నారు.

"తీసుకోవేం!" దర్పంగా అన్నాడు విశ్వం.

ఆ వ్యక్తి ఒక్కక్షణం విశ్వం కళ్ళలోకిచూసి తర్వాత చుట్టూచూసి "వొద్దులెండి" అనేసి గబగబ బయటికి నడిచిపోయాడు.

కొద్దిక్షణాలవరకూ ముందుకి జాపిన చేతిలోని వందరూపాయల నోటు రెపరెపలు చూస్తూ అలాగే ఉండిపోయాడు విశ్వం. అది స్వీకరించబడలేదు.

"అదేమిటండీ అంత మొత్తమూ?" అన్నాడు దుకాణదారు, విశ్వంవైపు వింతచూపులు చూస్తూ.

విశ్వం ప్రత్యుత్తరం ఇవ్వలేదు.

"ఏం చూపించమంటారు?" వ్యాపారం విషయంలోకి దిగాడు దుకాణదారు.

"గాబర్డీన్ సూటింగ్ చూపించండి."

విశ్వంవైపు ఆ అమ్మాయి మళ్ళీ చూసింది. యథాలాపంగా అటువైపే చూసిన విశ్వం ఆమె ఉనికిని అప్పటికి గుర్తించాడు. ఎక్కడో చూసిన రూపం అని అతనిమనసులో లీలగా అనిపించింది. ఆలోచించగా జ్ఞప్తికివచ్చింది. తను ఇంటర్మీడియేటు చదువుతున్నప్పుడు కాలేజీకి వెళ్లేసమయాల్లో స్కూల్కి వెళుతూ ఆ అమ్మాయి తనకి అప్పుడప్పుడు ఎదురయ్యేది! ఎవరో ఆమె! ఇప్పుడేం చేస్తోందో. పూర్వం తను చూసినప్పటికంటె ఇప్పుడు పొడుగెదిగింది. కొంచెం బొద్దుగాకూడా ఉంది.

బిల్లుచెల్లించి విశ్వం ప్యాకెట్ తీసుకుని బయటికి వచ్చాడు. అతని మనసులో మళ్ళీ తను ధర్మం చెయ్యబోయిన దృశ్యం మెదిలింది. అతనెందుకు తిరస్కరించాడు? భయపడిఉంటాడా? అంత మొత్తం అతనెప్పుడూ చూసిలేదేమో? పోలీసులు లాక్కుపోతారనుకున్నాడేమో? తను కావాలని అందరిఎదుటా ఇస్తున్నప్పుడు భయం దేనికి? తను ఇవ్వాలిసినవిధంగా ఇవ్వలేదేమో ఒకవేళ? అంతకంటె తనేం చెయ్యగలడు. ఎవరూ చూడకుండా అతని చొక్కా జేబులో పెట్టాలా? బతిమాలి తీసుకోమని నచ్చచెప్పాలా? అవసరం ఉన్నవాడే బెణకిపోతే తనసంగతేమిటి? ఏమైతేఏం, ఇప్పుడతను ఒకవేళ ఏ అఘాయిత్యం చేసినా తనకే బాధ్యత లేదు.

విశ్వానికి ఎందుకో సంతృప్తిగా లేదు. తనేదో పొరపాటు చేశాడేమో! తనలో బహుశా ఏదో లోపం ఉండిఉంటుంది. అకస్మాత్తుగా అతనికి ఒక విషయం తట్టింది. ఆ వ్యక్తిని ఎలాగైనా ఆ దీనావస్థనించి తప్పించి సహాయం చెయ్యాలనే దృష్టి తనలో లేదు. ఒక మంచి పనికోసం-ఒక ఘనకార్యం తనూ చేశాడనే మానసిక తృప్తికోసం తను బాహాటంగా అందరి ఎదుటా తన ఔదార్యాన్ని ప్రదర్శించాడు! సిగ్గుచేటు!

విశ్వం ముఖం మలినమైంది. ఆ వ్యక్తి తనని చెప్పుతో కొట్టినా ఇంత బాధపడేవాడు కాదు తను.

మరో ఊహకూడా వెంటనే తట్టిందతనికి. ఆ అమ్మాయి ఈ ఆర్భాటమంతా చూసి ఏమనుకుందో! తను బాగా డబ్బుగలవాడని అనుకుని ఉంటుంది. ఆ గాబర్డీన్ సూట్ తనకోసంకాదని ఆమెకి తెలియదు. పాపం. ఆమె తనవైపు చూడటం తను కనిపెట్టకపోలేదు. తను ఫలానా అని ఆమెకి తెలుసో, తెలియదో!

ఉన్నట్టుండి విశ్వానికి ఓ అనుమానం కలిగింది. తను ఈ హడావిడంతా ఆమె దృష్టిని ఆకర్షించటానికి చేశాడని దుకాణంలోని వాళ్లు అనుకున్నారేమో! కొంపతీసి ఆ అమ్మాయికూడా అలా అనుకోలేదుగద!

విశ్వానికి ముచ్చెమటలు పట్టాయి. తను పొరపాటు చేశాడు. ఒక వేళ ఆ వ్యక్తి ఆ వందరూపాయల నోటు తీసుకునిఉంటే ఉట్టిచేతుల్తో ఇంటికి వెళ్లవలసి వచ్చేది. ఇంట్లో అడిగితే ఏంసమాధానం చెప్పేవాడు? దానిమీద ఎంత గొడవ జరిగేది? తన పరిస్థితేమిటో వాళ్లకేం అర్థమవుతుంది? ఇంకా నయం! ఆ వ్యక్తి తనకి మేలేచేశాడు. ప్చ్, తను వొట్టి తొందరమనిషి!

6

రంగనాథంగారు ఇరవై ఏళ్ళు అఖండంగా హెడ్మాష్టరు గిరీ వెలిగించి రిటైరయ్యారు. ఆయనకి విశ్వం, పద్మ, గోపీ ముగురే సంతానం. కిందటి మాఘమాసంలోనే పద్మకి వివాహం జరిగింది ఆమె భర్త శ్రీనివాసరావు ఎం. బి. బి. ఎస్ ప్యాసై హౌస్ సర్జన్‌గా ఉండి ఆమధ్యనే హైదరాబాద్‌లో ప్రాక్టీసు పెట్టాడు. ఆనర్స్ చదువుతున్నప్పుడు విశ్వానికి అతని పరిచయం లభించింది. ఆ పరిచయమే తరవాత బాంధవ్యంగా మారింది.

ఆరోజున శ్రీనివాసరావు ప్రయాణం నిశ్చితమైంది. అనుకోకుండా పద్మకూడా అతనివెంట వెళుతోంది ఈసారి. పెళ్ళి అయిన తరవాత అత్తవారింటికి వెళ్ళటం ఆమెకిదే మొదటిసారి. ఎవరూ తోడు కూడా వెళ్ళటంలేదు. విశ్వాన్ని ఆహ్వానించాడు శ్రీనివాసరావు కాని "కాపరం పెట్టిం తరవాత చూడటానికి వస్తాలే" అన్నాడు విశ్వం.

బండి ఎక్కబోయేముందు తలిదండ్రులతో పాటు తనకి కూడా నమస్కారంచేసి పద్మ సెలవు తీసుకుంటూంటే విశ్వం హృదయం ద్రవిభూతమైంది. పద్మ తనకెప్పుడూ నమస్కారం చెయ్యలేదు అదివరదాకా. పద్మని కవ్వించి, నవ్వించి అల్లరిచెయ్యటం తనకి సరదాగా ఉండేది. అదికూడా ఊరుకోకుండా అంతకంటె ఎక్కువగా తనని కవ్వించేది. అకస్మాత్తుగా, తమ ఇద్దరిమధ్యా ఇన్నేళ్ళనించీ అణగి ఉన్న ప్రేమభావం పెల్లుబికింది. పద్మ ఈరోజున తనని గౌరవిస్తోంది. దాని జీవితంలో మరో అధ్యాయం ప్రారంభమైంది. కొన్ని క్షణాలు జీవితంమీద మహా ప్రభావం కలిగిఉంటాయి. ఈ దృశ్యం తన జీవితంలో ఎప్పుడూ మరవలేడు. నవ్వులాటకైనా పద్మని ఇక తను కవ్వించలేడు. వేళాకోళమైనా ఆమె చిన్నబుచ్చుకుంటే తన హృదయంలో మానని గాయం తగులుతుంది. కొన్ని మైళ్ళదూరంలో, మరో వాతావరణంలో పద్మ పరిస్థితుల్ని సరిపెట్టుకుని జీవితం గడపాలి. తన అభిరుచుల్ని అవసరమైతే మార్చుకోటానికి సిద్ధపడాలి. ఆ క్షణంలో విశ్వం మనసులో వింతకోరిక కలిగింది. పద్మకి జీవితకాలంలో తనేదైనా ఒక్క సహాయమైనా చెయ్యగలిగితే తన హృదయంలోని అవ్యక్తమైన ఏదో ఆరాటం, అస్పష్టమైనబాధ తగ్గి తనకి ప్రశాంతత కలుగుతుంది.

ఈ ఆలోచనరాగానే విశ్వానికి వెంటనే నవ్వు కూడా వచ్చింది. ఆమెకి సహాయం చెయ్యాలనేకోరిక బాగానే ఉంది. కాని ఆ అవసరం పద్మకి ఎందుకు కలగాలి!

దంపతుల్ని స్టేషన్‌దాకా సాగనంపటానికి విశ్వం, గోపీ స్టేషన్‌కి వెళ్లారు. శ్రీనివాసరావు ఏదో హుషారుగా మాట్లాడుతున్నాడు. కాని విశ్వం మనస్సు అంత బాగా లేదు.

గంట మోగింది. గార్డు ఈలవేశాడు. జండా ఊగుతోంది. ఇంజన్ కేక వేసింది. రైలు కదలబోతోంది.

పద్మ కేదైనా ఇవ్వాలనిపించింది విశ్వానికి. పత్రికల కుర్రాడు ఇంతలో అటువైపు వచ్చాడు. ఏవో కొన్ని పత్రికలు కొని పద్మకిచ్చాడు.

"ఎందుకన్నయ్యా ఇవన్నీ?"

"కాలక్షేపం ఔతుంది లే, ఉండనీ."

ఆ ఇవ్వటంవెనకాల హృదయం మూగభాష ఇద్దరికీ అర్థమౌతూనే ఉంది.

రైలు కదిలింది.

"వొస్తాబాబూ, గోపీ," అంది పద్మ గాద్గదికంగా.

వాడికి హృదయంలో కెలికినట్టయింది. బెంగ చూపులు చూశాడు. తనేదైనా తెలియక తప్పుచేస్తే, అమాయకంగా ఏదైనా అడిగితే "వెధవా, థర్డ్‌ఫారం వెలిగిస్తున్నావు గాని..." అని చనువుగా మందలించే వాళ్లు అక్కయ్యతప్ప ఇంకెవ్వరూ లేరని వాడికి తెలుసు. ఇంక అలా అనటానికి అక్కయ్యదగిర ఉండదు!

వాడి కళ్లలో నీళ్లు తిరిగాయి.

శ్రీనివాసరావు చెయ్యి ఊపాడు.

విశ్వం రుమాలు ఊపాడు.

క్రమంగా రైలు దూరమైంది.

గోపి చెయ్యిపట్టుకుని విశ్వం స్టేషన్‌బయటికి వచ్చాడు. ఇలాంటి వీడ్కోలు దృశ్యాలని తను పూర్వం "సెంటిమెంటల్ ట్రాష్" అని తోసేసేవాడు. ఈ రోజున అతని నేత్రాలు చెమ్మగిల్లాయి. అతనేమీ ఆలోచించటంలేదు. హృదయం బరువుగా ఉంది.

మార్గమధ్యంలో ఒక్కసారిమాత్రం విశ్వం, గోపీ మాట్లాడుకున్నారు.

"అక్కయ్య మళ్ళీ ఎప్పుడు వస్తుందన్నయ్యా?" అన్నాడు గోపీ.

"తొందరగానే వొస్తుంది." అన్నాడు విశ్వం. ఆ సమాధానం వాడికి తృప్తిగాలేదు. ఉండదని విశ్వానికీ తెలుసు.

"ఈ దేశంలో మగవాడు తన ఆధిక్యత రుజువు చేసుకోటానికి ప్రయత్నిస్తాడు. బహుశా ఎక్కడైనా అంతేనేమో. తేడా అనేది ఉంటే తరతమాల్లోనే! కాని, శ్రీనివాసరావు మంచివాడే" అని సమాధానపడ్డాడు విశ్వం.

ఇంటికివచ్చి భోజనాదులు ముగించుకుని తీరిగ్గా పడకకుర్చీలో పడుకుని పేపరుచూసి, చేసేపనిలేక నిద్రపోవాలని కళ్లు మూసుకున్నాడు విశ్వం. కాని నిద్రవచ్చే సూచన లేదు. సరదాగా మాట్లాడుతూ కాలక్షేపం చెయ్యటానికి పక్క లేదు. గోపి ఎప్పుడూ తోటపిల్లలతో ఆడుకుంటూనో, చదువుకుంటూనో ఎక్కడో ఉంటాడు. ఇక తనకి కావలసినంత తీరిక. ఫలితాలు తెలిసి ఉద్యోగం ఏదైనా వచ్చేదాకా రోజంతా విశ్రాంతే. ఈ సమయం వృధా పోనీయకుండా ఏదైనా చెయ్యాలని అనుకున్నాడతను. వెంటనే "జీవిత లక్ష్యం" సంగతి జ్ఞాపకం వచ్చిందతనికి. తన జీవితలక్ష్యం ఏదైతే బావుంటుంది?

బొమ్మలు వెయ్యటంలో తనకి అభిలాష కాస్త కూస్తా ఉంది. స్కూల్లో డ్రాయింగు పరీక్షల్లో తనకి మంచిమార్కులే వచ్చేవి. పక్షులూ, జంతువులూ తనకి కరతలామలకం. మనుషుల బొమ్మలుకూడా కొంచెం జాగ్రత్త తీసుకుంటే బాగానే వెయ్యగలడు. చిత్రలేఖనం కృషిచేస్తే తను అందులో పేరు సంపాదించుకోగలడేమో! కాని దానికి ఎంతో శ్రమా, ఓపికా, కాలమూ కావాలి. తన కెటువంటి ఉద్యోగం వస్తుందో! నేర్చుకుని కూడా బొమ్మలు వేసుకోటానికి తీరిక దొరకని ఉద్యోగమైతే ఆశాభంగం అవుతుంది. అయినా తను నిరుత్సాహపడకూడదు సాధకం చెయ్యాలి. తను గొప్ప చిత్రకారుడు కావాలి.

ఈ ఊహ కలగగానే దానిని ఆచరణలో పెట్టాలనే సంకల్పం దృఢమైందతనికి. తన అదృష్టంకొద్దీ ఆ ఊళ్ళోనే ప్రఖ్యాత చిత్రకారుడు ఒకాయన ఉన్నాడు.

విశ్వం ఆలస్యం చెయ్యకుండా ఆ సాయంకాలమే ఆయన దగ్గిరికి బయలుదేరి వెళ్ళాడు. ఆ చిత్రకారుడు అదృష్టవశాత్తూ తన స్టూడియోలోనే ఉన్నాడు ఆ సమయంలో. చిత్రలేఖనంలోని తన ఉబలాటమూ, కుతూహలమూ ఆయనకి తెలియచెప్పి సహాయం అభ్యర్థించాడు.

ఆ చిత్రకారుడు విశ్వాన్ని పరిశీలనగా చూసి ఒక తెల్లకాగితం, పెన్సిలూ ఇచ్చి అన్నాడు.

"కోడిగుడ్డు బొమ్మ వెయ్యండి."

విశ్వం క్షణంలో గీకేశాడు.

"సున్నా చుట్టండి."

విశ్వం సున్నా అనబడేది చుట్టాడు.

"ఈ రెంటికీ తేడా ఉన్నట్టులేదా!" అన్నాడు చిత్రకారుడు నవ్వు పెదవులోంచి చిందిస్తూ. విశ్వం చిన్నబుచ్చుకున్నాడు. అతనలా తనని పరీక్షిస్తాడని తను అనుకోలేదు.

"ప్రాక్టీసు చెయ్యలేదు గదండీ" అన్నాడు.

"నా సలహా విని మీ రీ ప్రయత్నం విరమించుకోండి."

"ఎందుకండీ?"

"మీకు బొమ్మలు వెయ్యటం రాదు."

అలా ఆయన కుండ బద్దలు కొట్టినట్టు నిర్మొహమాటంగా అంటే విశ్వానికి ఆశ్చర్యంతో బాటు ఆగ్రహంకూడా కలిగింది.

"నేను వేసే బొమ్మలు మా డ్రాయింగ్ మాస్టరుగారు మెచ్చుకున్నారండీ." అన్నాడు తమాయించుకుని.

"నేను డ్రాయింగ్ మాస్టర్ని కాదుగా."

"ప్రాక్టీసు చేసినా రాదంటారా?"

"ఉహుఁ. మీకు ఫ్రీ హాండ్ లేదు."

విశ్వం ముఖంలో నిరాశ తాండవించింది. 'ఇకనేమిటిలా నిరుత్సాహపరుస్తాడేం ఈయన' అనుకున్నాడు.

"ఏదైనా బొమ్మవేస్తాను, చూస్తారా?"

చిత్రకారుడు అయిష్టంగా ముఖం పెట్టాడు. అది అంగీకారమే ననుకుని విశ్వం కోయిలబొమ్మ గీశాడు.

"ఎలా ఉందండీ?" అని ఆశగా ఆయనవైపు చూశాడు, తప్పక మెచ్చుకుంటాడని భావిస్తూ.

అతను చిన్నగా, పొడిగా నవ్వాడు.

"చిత్రలేఖనం బదులు మరేదైనా చేస్తే మీ కాలం వృధా కాదు." అన్నాడు.

"అంతేనా?"

"మీమీద నాకేమీ ద్వేషం లేదు. ఫ్రీహాండ్ లేదని చెప్పాను, అంతే."

"మనిషి పుట్టగానే అక్షరాలు రాయటం రాదు కదండీ."

"అవును. ఇప్పుడా సంగతెందుకు?"

"నేర్చుకుంటే ఏదైనా వొస్తుందని చెబుతున్నాను. కాపీలు రాసినవాడు గుండ్రటి అక్షరాలు రాస్తున్నాడు. మీరైనా ఉన్నట్టుండి అమాంతంగా ఈ విద్య మీకు వొచ్చని తెలుసుకున్నారనుకోను."

"నన్ను మీరపార్థం చేసుకుంటున్నారు."

"అయితే క్షమించండి. కాని నా మాటలు నిజమని మీకు రుజువు చెయ్యగలను. సెలవు."

ఆయన ప్రత్యుత్తరానికి ఎదురు చూడకుండా విశ్వం చరచర వెళ్ళిపోయాడు. ఆ నాటినించీ అహోరాత్రులు శ్రమపడి, పుస్తకాలు చదివి తెలుసుకుని, అభ్యాసం చేసి రేఖాచిత్రాలు సునాయాసంగా గియ్యటం నేర్చుకున్నాడు. స్వశక్తిమీద అతనికి నమ్మకం ఏర్పడ్డది.

ఓ రోజు సాయంత్రం మళ్ళీ ఆ చిత్రకారుడి దగ్గిరికి వెళ్లాడు.

"మళ్ళీ వచ్చారూ?" అన్నాడాయన విశ్వాన్ని గుర్తుపట్టి.

"శిష్యరికంకోసం కాదులెండి; రుజువుకోసం." అనేసి కాగితం ఆయనముందుపెట్టి ఓ సున్నా గీసేశాడు.

"ఇదిగో మీ సున్నా. ఇంకా కొన్ని కావాలా? ఒకటి, రెండు, మూడు—" చిన్నవీ, పెద్దవీ వరసగా కొన్ని సున్నాలు గీశాడు విశ్వం. ఆయన ఆశ్చర్యంగా వాటివైపు చూశాడు.

"అలా తెల్లబోకండి మరి. నాకు ఫ్రీ హాండ్ లేదుగా." వ్యంగ్యంగా అనేసి వెళ్ళిపోబోయాడు విశ్వం. తటాలున చిత్రకారుడు అతని బుజంమీద చెయ్యేసి ఆపాడు. చిరునవ్వు నవ్వాడు.

"భేష్" అన్నాడు.

విశ్వంకోపం ఇంకా పోలేదు.

"సెలవిప్పించండి" అనేసి వెళ్లబోయాడు.

"నిన్ను ఆశీర్వదిస్తున్నాను." అన్నాడాయన. విశ్వం వెళ్ళలేకపోయాడు. ఓటమిని అంగీకరించి తనని ఆశీర్వదించిన అతని సహృదయత్వం విశ్వంకాళ్ళకి బందాలు వేసింది.

"తొందరపడి ఆవేశంగా మాట్లాడాను. క్షమించండి."

"ఫరవాలేదు. నా దగ్గిర తెలుసుకోవాలిసింది ఏదైనా ఉంటే నీ ఇష్టం వచ్చినప్పుడు నిరభ్యంతరంగా రావొచ్చు. చాలా సంతోషిస్తాను." అన్నాడు చిత్రకారుడు. అతని హృదయ వైశాల్యం విశ్వంలో భావోద్రేకం కలిగించింది.

"మహద్భాగ్యం." అన్నాడు.

"వెళ్ళిరా ఇంక." సెలవిచ్చాడు చిత్రకారుడు.

తేలికపడ్డహృదయంతో విశ్వం సెలవుతీసుకున్నాడు. కాఠిన్యం వెనకాలనే ఎంత మృదుత్వం ఉంటుంది! అదే ఆ కళాకారుడి సందేశం అనిపించింది విశ్వానికి.

7

నవ్యనాటకసంఘం అనే సంస్థకి ఆ రోజున ప్రారంభోత్సవం జరుగుతోంది. దానికి కార్యదర్శి రంగారావనే యువకుడు. స్కూల్ టీచర్. అతను

విశ్వంతో ఎస్.ఎస్.ఎల్.సి. దాకా కలిసి చదివాడు. తరవాత విశ్వం కాలేజీ చదువుకీ, రంగారావు సెకండరీ ట్రెయినింగ్ కీ వెళ్ళారు. అయినా ఇద్దరిదీ ఒకే ఊరు కావటంవల్ల తరుచు కలుసుకుంటూ తమ స్నేహాన్ని వర్ధిల్ల చేసుకుంటూ వచ్చారు. రంగారావు బాగా పాడగలడు. అతనికి నాటకాలంటే మొదటి నించీ సరదా. తోటివాళ్ళని కొందర్ని కూడగట్టుకుని నాటక సంఘం స్థాపించాడు. విశ్వానికి నాటకాలలో అంత అభిరుచి లేదు. అయినా రంగారావు ప్రోద్బల ప్రోత్సాహాలవల్ల సంఘంలో అతను కూడా సభ్యుడయ్యాడు. ప్రారంభోత్సవానికి వచ్చేవరకూ సంఘంలోని ఇతర సభ్యుల్ని గురించి విశ్వానికేమీ తెలియదు. ముఖ్యసభ్యుల్ని రంగారావు అంతకి కొంచెంముందే పరిచయం చేశాడు.

పెద్దల ఉపన్యాసాల తరవాత ముఖ్యసభ్యులు కొందరు ప్రసంగాలు చేశారు. కళామయ జీవితానికి ఆ రోజున తమని అంకితం చేసుకుంటున్నామనీ, కళని ఉద్ధరించటమే తమ జీవితాశయమనీ అందరూ ఉద్ఘాటించారు.

తరవాత వినోదవిజ్ఞానదాయకమైన కార్యక్రమం ప్రారంభమైంది. అందులో మొదటి అంశం రంగారావు గానం.

అతను శ్రావ్యంగా పద్యాలు పాడుతుంటే సభికులు తన్మయులై వింటున్నారు. తనకి పద్యం పాడటం రానందుకు విశ్వం ఆక్షణంలో మిక్కిలి విచారించాడు. మంచి పాట విన్నప్పుడు అనుకరించాలనే తన అభిలాష ఈ జీవితంలో తీరదు. తను ఆ విషయంలో చేసిన వివిధ ప్రయత్నాలు గుర్తొచ్చాయి విశ్వానికి. తన స్వరం తనకే అసహ్యంగా వినిపించేది. ఓసారి బీచివొడ్డున ఒంటరిగా ఉన్నప్పుడు భావావేశంతో తను గొంతెత్తి ఏదో పద్యం రాగయుక్తంగా అనబోయినప్పుడు తన స్వరం సముద్రపు ఘోషతో, కెనడా ఇంజను కేకతో తులతూగి చుట్టుపక్కలవాళ్ళకి భయకారణం కావటం తనెప్పుడూ మర్చిపోలేడు. రంగారావు ఒకసారి ఏ పాట విన్నా తు చ తప్పకుండా అదే వరసన సాహిత్యంతోసహా మళ్ళీ అనగలడు. రంగారావుమీద తనకి కొంచెం అసూయ జనిస్తున్నట్టు పసికట్టి విశ్వం నవ్వుకున్నాడు. తను ఆనర్స్ పరీక్ష బాగా రాశాడని విన్నప్పుడూ, తన బొమ్మలు చూసినప్పుడూ రంగారావులో కలిగిన ఈర్ష్యాభావం తను గ్రహించగలిగాడు. అయితే ఇలాంటి భావాలకి విలువ ఇవ్వటం అనవసరం. ఈర్ష్య అనటం కంటె అసంతృప్తి అనటం సమంజసం. అవతలివాడికి ఉందని ఏడవటం ఈర్ష్య. తనకి లేదని విచారించటం అసంతృప్తి. చాలా మంది మనుషులు బహుశా ఈ రెండో తరగతికే చెందుతారు. ఈ భేదం గమనిస్తే మనుషుల్ని ఇంకా బాగా అర్థం చేసుకోటానికి వీలుంటుంది.

విశ్వం ఇలా ఆలోచిస్తుండగా రెండో అంశం ప్రారంభమైంది. నటేశ్వరరావు అనే నటుడు నటనలోని వివిధ అంశాలను సోదాహరణంగా వివరించి చివరికి ఏకపాత్రాభినయం చేసి ప్రేక్షకుల మన్ననల్ని అందుకున్నాడు.

ఆ తరవాతదే విశ్వం ప్రోగ్రాం. "మానవత్వం" అనే పేరుతో అతను ఒక చిన్న గేయం గానం చేశాడు. రాగం జోలికి పోకుండా ఆవేశంగా చదువుతూ తన్నుతానే మర్చిపోయి అక్కడక్కడ చిన్న వ్యాఖ్యానాలు కూడా చేశాడు. చివరికి—

అనిమిషత్వం నా ఆశ
మానవత్వం నా శ్వాస

అనే పంక్తులు ఉద్రేకంగా హెచ్చుస్థాయిలో అని కూర్చున్నాడు. సభికులు చప్పట్లు కొట్టారు.

కార్యక్రమం అయిపోగానే చాలామంది విశ్వం గేయాన్ని ప్రత్యక్షంగా మెచ్చుకుని అతనిని అభినందించారు. విశ్వం వాళ్ళ మెచ్చుకోలుకి సంతోషాశ్చర్యాలు పొందాడు. తను అప్పుడప్పుడు గేయాలు రాసేవాడే. కాని ఇంతవరకు ఒక్క గేయం కూడా ప్రచురించలేదు. ఏవో రాయాలని అనిపించినప్పుడు కూర్చుని నాలుగు పంక్తులు రాసేవాడు. అవి ఇతర్లు మెచ్చుకుంటారో లేదో అనే ఊహ అతని కెప్పుడూ రాలేదు. ఒక్కసారిగా అందరూ తనని ప్రశంసించటంవల్ల తబ్బిబ్బయిపోయాడు. కృతజ్ఞత చెప్పాలనే సంగతి కూడా అతనికి తట్టలేదు. రంగారావు తన గేయాలు కొన్ని వినటం, ఏదో ఒకటి ప్రారంభోత్సవ సమయంలో చదవమని బలవంతం చెయ్యటం అతను గుర్తుచేసుకొని రంగారావుకి కృతజ్ఞత చెప్పాడు.

ఆ సమయంలోనే ముఖ్యసభ్యులు కొందరు విశ్వం చుట్టూ చేరారు.

"రంగారావు గారూ, విశ్వంగారిచేత మంచి నాటకం ఒకటి రాయించాలి మీరు" అన్నాడు ఒక సభ్యుడు.

"అందులో మంచి గేయాలు తప్పకుండా ఉండాలి."

మరో సభ్యుడు తన అభిప్రాయం వెలిబుచ్చాడు.

"థాంక్స్—కాని నాకు నాటకాలు రాయటం రాదండీ" అన్నాడు విశ్వం.

"మేం నమ్మంలెండి."

"సభ్యుడివి. నువ్వే తప్పించుకోవాలంటే ఎలా?" అన్నాడు రంగారావు.

"తాహతుకి దాటిన పనులు నెత్తినేసుకుంటే ఏమవుతుందో తెలుసా?"

"అదంతా మాకు వొదిలెయ్యి."

"నాటక సంఘం నాలుగు కాలాలపాటు వర్థిల్లాలని లేదా?"

"కుంటిసాకులు చెప్పకు. నువ్వు తలుచుకుంటే రాయగలవు. అంతే." అన్నాడు రంగారావు. అందరూ ఆమాటే సమర్థించారు. విశ్వానికి మాత్రం గుండెల్లో రాయిపడ్డది. తనెప్పుడూ నాటకం కాదు గదా కథ కూడా రాయలేదు. ఏదో చెత్తరాసి వాళ్ళ మీదా, ప్రజల మీదా రుద్దితే ఫలితాలు సంగతి అలా ఉంచి తనకే అపచారం చేసుకున్నవాడవుతాడు. ఏం చేయాలో అతనికేం తోచలేదు. రంగారావుతో ఈ విషయం గురించి తరవాత రెండు మూడుసార్లు ముచ్చటించాడు. అతను ఉన్న సంగతి విశదం చేశాడు.

"ఒరే విశ్వం, మనకి నాటకాలు సరైనవి ఎక్కువ లేవు. ఉన్నవి కూడా పాతవి" ఉద్యోగ విజయాలు"లాంటివి మనం వెయ్యబోవటం లేదు గదా! నాటక సంఘం శ్రేయస్సు కోరి నువ్వు నీచేతనైనంతలో ఏదైనా రాసివ్వు, బాగుంటే వేద్దాం."

ఇక విశ్వం ఏమీ అనలేకపోయాడు. ఆలోచించి సాంఘిక నాటిక ఒకటి రాసిచ్చాడు. అందరూ 'ఫస్టుగా ఉంద'న్నారు. రిహార్సల్స్‌కి వొచ్చి సూచనలిస్తూ ఉండమని విశ్వాన్ని అడిగాడు. విశ్వం అలాగేనన్నాడు కాని వెళ్లటానికి అతనికి మనసొప్పేదికాదు. ఈ నాటకాల గొడవల్లో పడితే తన చిత్రకళోపాసన పూర్తిగా దెబ్బతింటుంది. చిత్రకళే తన లక్ష్యం.

ఒకరోజు రంగారావు మరీబలవంతం చెయ్యటం వల్ల ఆ సాయంత్రం రిహార్సలుకి వెళ్లాడు.

టౌన్లో ఓ మూలగది అద్దెకి తీసుకుని 'నాటక సంఘం' అని బోర్డుకట్టారు. ఆ గదిలోని వాతావరణం చూసేసరికి విశ్వానికి చిరాకు వేసింది. ఉన్న సామాను చిందర వందరగా వుంది. కొందరు బీడీలు, మరికొందరు సిగరెట్లు తాగుతూ గది పొగతో నింపి కాల్చి వేసిన పీకలు గదిలోనే పారేస్తున్నారు. సభ్యులలో కూడా ఒక క్రమశిక్షణ లేదు. ఎవడి ఇష్టం వచ్చినట్లు వాడు ప్రవర్తిస్తున్నాడు. తబలా ఒకపక్కన మోగుతూనే ఉంది. సభ్యులు మాట్లాడుతూనే ఉన్నారు.

"హీరోయిన్ ఎవరు వేస్తున్నారు?" అన్నాడు విశ్వం.

"వసంత అనే అమ్మాయి. అందాల బరిణలే. చూస్తే గుమ్మయిపోతావు. 'ఒక్కనవ్వే పలు వజ్ర వైడూర్యాలు' అన్న కవి ఈవిడని చూశే రాశాడా అనిపిస్తుంది. ఆ కళ్లూ, ఉంగరాల జుట్టూ, వాలు జడా కపోలలూ...ఓహ్!"

అతని ధోరణి మధ్యలోనే ఆపి, "నువ్వు కూడా కవివా ఏమిట్రోయ్?" అన్నాడు విశ్వం.

"ఆ పిల్లని ఒక్కసారి చూస్తే కవిత్వం నురుగులు కక్కుతూ పరుగులు తియ్యదూ?"

"అదేం అలంకారం, మహాశయా?" అన్నాడు ఒక నటుడు.

అందరూ గొల్లుమన్నారు.

"నీకు పెళ్లియింది కదురా?" అన్నాడు విశ్వం.

"అయితే ఏమండీ, రసపాయి మన రంగారావు." అన్నాడు ఒక సభ్యుడు. అందరూ మళ్ళీ గొల్లుమన్నారు.

"జాగ్రత్త రంగారావు. చెయ్యి పట్టుకునేవు. కఠోరాణి వజ్రాదపి..."

"స్వానుభవమా స్వామీ?" అన్నాడు రంగారావు.

విశ్వం ఈ సంభాషణకి విసుక్కున్నాడు. విషయం తప్పిస్తూ అన్నాడు.

"ఆమె బాగా నటించగలదా?"

"పిచ్చివాడా? నీకు బొత్తిగా లోకజ్ఞానం లేదు. అందమైన ఆడది నటించడ మెందుకోయ్. స్టేజిమీద నిలబడితే చాలదూ? నోళ్ళు తెరుచుకుని చూడరూ జనం?"

"జనం సంగతి కాదు. ఆమె నటన సంగతి అడుగుతున్నాను."

"నాకు బాగానే ఉంటుంది ఆమె నటన."

"ఏమండీ డైరెక్టర్ గారూ?"

"గొప్పగా నటిస్తుందండీ. మొదటి నాటకంతోటే ఆమె సినీఫీల్డులో చేరిపోతుంది లెండి. అలాంటి వాళ్ళు నాటకాల్లో 'రాట్' అవుతారా?"

విశ్వం కొంచెం ఆశ్చర్యంగా అతనివైపు చూశాడు.

"నాటకాలు వెయ్యటం 'రాట్' కావటమనా మీ అభిప్రాయం? ప్రారంభోత్సవసమయంలో నాటక కళనిగురించి గొప్పగా మాట్లాడారే!"

"నా అభిప్రాయంకాదు. ఆమె దృక్పథం అదే ఐ ఉంటుంది."

"సినిమాల్లో చేరితే అంత నాజూకుగా ఉండదు లెండీ." అని విచారించాడు ఒక నటుడు.

"ఎందుకండీ?" అన్నాడు చిరునవ్వుతో మరొకడు.

"తెలిసియు దెలియని నరుదెల్ప బ్రహ్మదేవుని వశమే!"

"కవిచౌడప్ప శతకంలోని పద్యంకాదూ?"

"చంద్రరేఖావిలాపంలోదైతే మరీ రంజుగా ఉంటుంది."

"ఒరు లేయవి యొనరించిన నరవర..." అని భావగర్భితంగా తలూపాడు మరొకడు.

వాళ్ళవైపు జుగుప్సతో చూశాడు విశ్వం.

"ఆమె ఇవాళ రిహార్సల్ కి వొస్తుందా?"

"ఎందుకురాదు? డబ్బిస్తున్నాంసార్."

"ఎవరైనా త్వరగా రమ్మని హెచ్చరించివస్తే బావుంటుందేమో. త్వరగా రిహార్సలు మొదలుపెడితే పెందరాళే వెళ్ళిపోవొచ్చు." అన్నాడు విశ్వం.

"అందుకే కదండీ నటేశ్వరరావుగారు వెళ్ళారు. మరొకరు వెడితే ఆయన ఒప్పుకోరు."

"ఏం?" అన్నాడు విశ్వం అర్థంకాక.

"అదంతే లెండి. ఏం రంగారావుగారూ?"

రంగారావు 'హుం' అని ముఖం చిట్లించుకున్నాడు.

"నటేశ్వరరావుకి ఎన్నిసార్లో చెప్పాను — కొంచెం జాగ్రత్తగా ఉండమని. ఎప్పుడో గాజుల చెయ్యి చెంపకుపరంబు కాకతప్పదు లే."

అందరూ నవ్వారు.

"ఆమె రేటెంత?" అన్నాడు విశ్వం.

అందరూ ఒక్కసారి ముఖముఖాలు చూసుకున్నారు. వాళ్ల ముఖాల్లో ఆశ్చర్యం తాండవించింది. వాళ్లలా ఎందుకు చూస్తున్నారో విశ్వానికి తెలియలేదు.

"ఏమిటో అనుకున్నాను. నువ్వూ రసికుడివే." అని రంగారావు నవ్వాడు.

"ఏమిటి నువ్వనేది?"

"ఓయి మహానుభావా, ఆమె రేటెంతో ఇంతవరకూ తేలకనే చస్తున్నాం. కొంచెం హైక్లాసల్లే ఉంది."

"అసలామె అటువంటిదికాదేమోనండీ. చదువుకుంది కూడా."

"అవన్నీ తీసి అవతలపెట్టండి. అది వంశ పారంపర్యం స్వామీ."

విశ్వానికి అర్థమైంది. 'ఛీ' అనుకున్నాడు. తన ప్రశ్న ఎంత తుచ్ఛంగా అర్థం చేసుకున్నారు. ఆ రెండో అర్థంలోనే వాళ్ళెందుకు తీసుకోవాలి. వాళ్ళ మనస్సులన్నీ కల్మషపూరితాలు. ఇదా వీరి కళారాధన. నాటక సంఘంట! వెంటనే రాజీనామా పారెయ్యాలనిపించింది విశ్వానికి. కాని అంతమందిలో ఆ పనిచేసి గొడవపడదలచుకోలేదు. రంగారావులో కూడా ఇంత నీచత్వం ఉందనుకోలేదు. కళాకారుడే. ఏం లాభం? ఒక వ్యక్తిని పరోక్షంలో చులకన చెయ్యడం ఘనకార్యమా? ఇంతమంది నాటక కళోద్ధారకులు ఇక్కడ కూడి చేసే పని అదేనా?

ఆమె ఎటువంటిదైనా కావొచ్చు. కాని ఆర్టిస్టు. ఆ గౌరవం ఇవ్వలేనివాడు ఆర్టిస్టు అనిపించు

ఉంటాడా? అందరూ చదువుకున్నవాళ్లే, మాటల్లో మాత్రం సభ్యత ఎక్కడా కనిపించదు. విశ్వానికి అక్కడ ఉండ బుద్ధిపుట్టలేదు.

"వెడతాను రంగారావు. తరవాత ఎప్పుడైనా వొస్తాలే" అన్నాడు మర్యాదకి.

అదే సమయంలో నాయికపాత్ర నిర్వహించే నటీమణి లోపలికి అడుగుపెట్టింది. "ఆమె వొచ్చిందోయ్. కాసేపు కూర్చునిపోదుగానిలే" అని, ఆమె వైపు తిరిగి ఆహ్వానించాడు రంగారావు "రండి. రండి."

అందరూ ఆప్యాయంగా పలకరించారు.

"ఆలస్యమైం దేమండీ?"

"ఒంట్లో కులాసాగా ఉందా?"

"రారేమో అనుకున్నాం."

కుశలప్రశ్నలు వెయ్యసాగారు. ఆమె కొంచెం ముభావంగా సమాధానాలు చెప్పింది. రంగారావు విశ్వాన్ని ఆమెకి పరిచయం చేశాడు.

"వీరే మన నాటిక రచించినవారు. విశ్వేశ్వరావు. బి. ఏ. ఆనర్స్."

"నమస్తే. ఇంకా ఆనర్స్ కాలేదులెండి." అని చిరునవ్వుతో ఆమె ముఖంలోకి చూసి అదిరిపడ్డాడు విశ్వం.

వసంత అంటే ఆమేనా? ఆరోజున గుడ్డలకొట్లో తనకి కనిపించింది. అనేకసార్లు స్కూల్‌కి వెడుతూ తనకి ఎదురైంది.

"నమస్తే" అంటూ వసంత విశ్వం ముఖంలోకి చూసి ఏదో అనబోయి మళ్ళీ మాట్లాడకుండా ఊరుకుంది. ఆమె ముఖంలో కూడా ఆశ్చర్యం ప్రతిఫలించటం విశ్వం కనిపెట్టాడు.

రిహార్సల్సు ప్రారంభమయాయి. ఆమె చక్కగా పాడుతుందని మెచ్చుకున్నాడు విశ్వం. ఆమె నటననీ, పాటనీ పదేపదే మిగతావాళ్లందరూ పోటీలుపడి మెచ్చుకున్నారు. అయితే ఇదంతా రోజూ మామూలేగనుక వాళ్లి పొగడ్తలకి ఆమె ఏమీ ఉబ్బిపోలేదు. విశ్వం అతిగా మాట్లాడక "బాగా పాడారండీ" అనీ "బాగా నటించారండీ" అన్నప్పుడు ఆమె నిజంగా సంతోషించింది.

ఆరోజుకి రిహార్సలు చాలించారు. బాగా చీకటి పడ్డది. వెంకటేశ్వరావు తోడువస్తానన్నాడు.

"అక్కర్లేదు లెండి. మీరు మళ్లీ వెనక్కి ఇంత దూరం రావటం శ్రమ." అంది వసంత.

"నాకేం శ్రమలేదు."

"నేను బజారువైపు వెడుతున్నాను. రిక్షా పంపిస్తాలెండి, పోనీ" అన్నాడు విశ్వం.

"నేనూ బజారువైపే వెళ్ళాలి. దారిలో కనిపిస్తే రిక్షా చేసుకుంటాను. పదండి, పోదాం" అంది వసంత.

వెంకటేశ్వరావు విశ్వంవైపు కొంచెం గుర్రుగా చూశాడు.

విశ్వం ముందు నడుస్తున్నాడు. వసంత కొంచెం వెనకగా, పక్కగా నడుస్తోంది. ఇద్దరిమధ్యా నిశ్శబ్దం ఆవరించింది. ఏదో మాట్లాడాలనిపించింది విశ్వానికి. కాని అతనికేం మాట్లాడాలో తోచలేదు. ఆమే పలకరించింది.

"నాటిక రాసింది మీరేనంటే ఆశ్చర్యపడ్డానండీ" అంది.

"ఏం నాముఖంలో ఆకళేమీ కనిపించటం లేదా?" అన్నాడు చిన్నగానవ్వి.

"అబ్బే అదికాదండీ. మిమ్మల్ని ఎక్కడో ఇదివరకు చూశానండీ—ఈమధ్యనే"

"ఎక్కడ?"

"జ్ఞాపకం రావటంలేదు. అంతకిముందు కూడా చాలాసార్లు చూశాను. నేను స్కూల్‌కి వెడుతున్నప్పుడు మీరు..."

"కాలేజీకి వెడుతూ కనిపించేవాడిని కదూ?"

"అవును. మీరు కూడా నన్ను చూశారన్నమాట."

"చూడకేం?"

"ఆఁ—! ఇప్పుడు జ్ఞాపకం వచ్చిందండి. మీరు ...మీరు..." ఆమె ఆగింది.

"ఒక బట్టల దుకాణంలో కనిపించాను కదూ?"

"అవును. కాని అదేమిటండీ, ఎవరైనా అడుక్కునేవాళ్లకి వందరూపాయలు ఇస్తారా? భలేవాళ్లేనే."

"ఏం, ఇవ్వకూడదా?"

"మీకు బాగా డబ్బున్నట్టుంది."

"లేకపోతే ఇవ్వకూడదా?"

"అని కాదు. ఎక్కడినించి వస్తుంది?"

"నేను గొప్పవాడిని కాదు, నిజం చెప్పాలంటే."

"అదే నేనూ అనుకున్నాను."

"ఎలా అనుకున్నారు?"

"ధనవంతులైతే కారుండదూ? దుకాణం బయట కారేమీ లేదుగా!"

"మీకు మంచి పరిశీలనాశక్తి ఉందండీ."

"ఈమాత్రం దానికే! పొగడదలుచుకుని పొగుడుతున్నారు."

"మిమ్మల్ని ఊరికే పొగిడితే నాకేం లాభం?"

"నేను బాగా నటించానని మీరు మనస్ఫూర్తిగా అనుకుంటున్నారా?"

"లేక పోతే అలా అనటానికి నాకేం అవసరం?"

"మీరు మెచ్చుకుంటే చాలా సంతోషం కలిగిందండీ. మీకు కోపంవస్తుంగేమో గాని, మీస్నేహితులు ముఖస్తుతికోసం అలా అంటారని వాళ్ల మాటల్ని బట్టే తెలుస్తుందండీ."

"వాళ్ళు నా స్నేహితులు కారు." అన్నాడు విశ్వం ముఖం చిట్లించుకుని, హేయభావంతో. వసంత ఆశ్చర్యపోయింది.

"అలాగా? అయితే నేనుపొరపడ్డాను, సుమండీ."

"రంగారావు ఒక్కడే నాకు స్నేహితుడు. రేపు మొహం వాచేట్టు వాడిని చివాట్లు పెడతాను." అన్నాడు విశ్వం కోపంగా.

"ఎందుకు?" అంది వసంత ఆశ్చర్యంగా.

విశ్వం తన పొరపాటు గుర్తించాడు. నప్పుడ అతనికి వసంత ఇంతకిముందు అన్న మాటలు గుర్తుకొచ్చాయి.

"ముఖస్తుతి చేస్తున్నందుకు."

"ఓ అదా!" అంది వసంత.

"మరేమి టనుకున్నారు?"

"ఏం లేదులెండి."

కొంచెంసేపు మౌనంగా నడిచారు ఇద్దరు. రిక్షా కనుచూపు మేరలో ఎక్కడా లేదు.

"ఈ నాటకంలో వేస్తున్నందుకు మీ రెంత తీసుకుంటున్నారు?"

"డబ్బా!" అంది వసంత.

"ఊఁ"

వసంత కొంచెం ఆశ్చర్యపడి అంది.

"నేను నాట సంఘంలో సభ్యురాల్నికదండీ"

"అలాగా! అయితే సరదాగా వేస్తున్నారన్నమాట."

"అవును. అదీకాక ఇదే నేను మొదటిసారి నటించబోవటం. నా శక్తి ఎంతవరకుందో తెలుసుకోవాలని ఒప్పుకున్నాను."

"పేరువస్తే ఏం చేస్తారు?"

"వీలైతే సినిమాలో చేరాలని ఉంది." అంది.

విశ్వం ఏమీ మాట్లాడలేదు. ఆ సమాధానం ఎందుకో అతనికి రుచించలేదు. వసంత మనసులో ఉన్నది మర్మంలేకుండా చెప్పే అమాయకురాలని గ్రహించాడు. నాటక సంఘంలోని వాళ్లందరూ ఆ క్షణంలో తోడేళ్ళలా అతని మనోవీధిలో కనిపించారు. అతనిహృదయం ఆరాటపడ్డది.

"నాటక సంఘంలో కొంచెం జాగ్రత్తగా ఉండండి"

"ఏం?"అంది వసంత ఆసక్తిగా అతనివైపుచూస్తూ.

"వాళ్ళలో కళారాధకంటే పాడుబుద్ధులే ఎక్కువ." అన్నాడు విశ్వం. కాని వెనువెంటనే తొందరపడి అలా వాళ్ళమీద అభిప్రాయం వెలిబుచ్చినందుకు చింతించాడు. ఈ విషయాల్లో తనెందుకు అనవసరంగా కల్పించుకోటం? రొంపిలోకి దిగనే కూడదు.

వసంత ఏదోటో ఆలోచిస్తూ నడుస్తోంది. ఆమె తెలివితక్కువదేమీ కాదు. ప్రపంచం పోకడలు తెలియనిదీ కాదు. నాటకసంఘంవాళ్ళ బుద్ధులు పసిగట్టక పోలేదుకూడా. కాని ప్రత్యేకించి విశ్వం అలా ఎందుకు హెచ్చరించాడో ఆమెకి అర్థంకాలేదు. కవిగారు అంటే అంటవట్టుగా మాటాడుతున్నారు. నాటక సంఘంలో మిగతావాళ్ళకి మల్లేకాక కవిగారుమాట్లాడే మాటల్లో ఆమెకి హుందాతనం, ఆదరమూ కనిపించాయి. వందరూపాయలు ఊరికే వొదులుకోబోవటంలో నే తనకి ఆయనమనసు మంచిదని తెలిసింది. రిక్షాఏదో ఎదురుగుండా వస్తోంది ఖాళీగా.

"ఇంక రిక్షా ఎక్కండి."

"ఇంకెంతో దూరం లేదండీ మా ఇల్లు. ఇప్పుడు రిక్షా దేనికీ. నడిచేవస్తాను." అంది వసంత. వెంకటేశ్వరావైతే తను రిక్షాలో వెడతానంటే "సరదాగా నడిచి వెడదామండీ." అనేవాడు. ఆ వెంకటేశ్వరావుని చూస్తుంటే తనకి ఒక్కొక్కసారి అరికాలిమంట నెత్తికెక్కుతుంది. కొంచెం జాగ్రత్తగా మసులుకోమని చెప్పాలి.

"మీరు బి. ఏ. ఆనర్సు పాసయ్యారా?" అందామె.

"ఇంకాలేదు. పరీక్షకి వెళ్లాను. ఫలితాలు రాలేదు."

"పాసయినరోజున మీకు నేను టీపార్టీఇస్తాను. ఏమంటారు?"

"థాంక్స్. రెడీ" అన్నాడు విశ్వం నవ్వుతూ.

మాటలసందడిలో ఎంతదూరం నడిచిందీ తెలియలేదు వాళ్లిద్దరికీ. అకస్మాత్తుగా వసంత ఆగి అంది.

"ఇదేనండీ మా ఇల్లు. ఇంక వెడతాను."

"మంచిది." అనేసి విశ్వం ముందుకి సాగిపోయాడు. లోపలికి వెడుతూ వసంత నాలిక కొరుక్కుంది. తను ఇన్నిమాటలు మాట్లాడినా నాటిక గురించి ఒక్కముక్కయినా అనలేదు. తను వొట్టి మతిపిచ్చిది. ఏమనుకున్నారో కవిగారు!

(సశేషం.)